క్లుప్తంగా

మునిపల్లిలో 'బలగం' సినిమా ప్రదర్శన



జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లిలో గురువారం రాత్రి 'బలగం' సినిమా చిత్రాన్ని ప్రదర్శించారు. సర్పంచ్ సాయరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవసరమైన ఏర్పాట్లు చేసి బలగం సినిమాను ప్రదర్శించారు. గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సినిమా ప్రదర్శనను ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఆసక్తిగా తిలకించారు.

'ఆయుష్మాన్ భారత్'తో పేదలకు మేలు



సుభాష్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమల్జేస్తున్న ఆయుష్మాన్‌భారత్ పథకంతో పేదలకు అధిక ప్రయోజనం చేకూరుతోందని హిందూ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ధాత్రిక రమేష్ పేర్కొన్నారు. నగరంలోని అర్హులైన పేదలను గుర్తించి గురువారం ధాత్రిక రమేష్, ఐటీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో తెల్ల రేషన్‌కార్డుతో ఆన్‌లైన్‌లో ఈ–కేవైసీ చేశారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ పథకం ద్వారా ప్రయివేటు ఆస్పత్రుల్లో రూ.5లక్షల వరకు వైద్యచికిత్సలు పొందవచ్చని తెలిపారు.

పరీక్షలంటే భయపడొద్దు



డిచ్‌పల్లి: విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని విడిచిపెట్టాలని, ఒక ప్రణాళిక ప్రకారం ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని నిజామాబాద్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సంపూర్ణ సూచించారు. మండల కేంద్రంలోని మానవతసదన్‌ను గురువారం సాయంత్రం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు బాగా రాయాలని, ఎలాంటి టెన్షన్ పెట్టుకోవద్దని సూచించారు. ఇంటర్ పూర్తయిన పిల్లలు ఎంబీబీఎస్ కోసం సిద్ధం కావాలని తెలిపారు. పిల్లలు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. కమిటీ మెంబర్ శోభ, సదన్ కేర్‌టేకర్ అందెరమేష్, కొల్లరవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాడీ ఫ్రీజర్ అందజేత



ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్ నగర్‌కు చెందిన కరికెల్లి ప్రేమ్‌సాయి తన తండ్రి కరికెల్లి రాజేందర్ గుప్తా జ్ఞాపకార్థం మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్‌కు గురువారం డెడ్ బాడీ ఫ్రీజర్‌ను అందజేశారు. మంచాల ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



రెంజల్(బోధన్): కందకుర్తిలో నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా జరిగాయి. శ్రీరామ నవమి పండగను పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం గ్రామంలో కుస్తీ పోటీలను నిర్వహిస్తారు. రెంజల్‌లో పాటు చుట్టుపక్కల మండలాలు, మహారాష్ట్ర నుంచి కుస్తీలు పట్టేందుకు యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చివరి కుస్తీ విజేతకు రూ.15 తులాల వెండి కడియాన్ని స్థానిక సర్పంచ్ ఖలీంబేగ్, బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్‌లు అందించారు.

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. స్థానిక ఎంపీటీసీ కొట్టం మనోహర్ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు ఏర్పాటు చేశారు.

రుద్రూర్: మోస్రా మండలం గోవూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ, గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం కుస్తీ పోటీలు ఏర్పాటు చేశారు. తొలి కుస్తీ రూ.50తో ప్రారంభం కాగా ఆఖరు కుస్తీ రూ.2,500తో ముగిసింది. స్థానిక సర్పంచ్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎడపల్లి(బోధన్): పోచారంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి నగదు బహుమతి అందజేశారు. సర్పంచ్ ఇంద్రకరణ్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం..





మాధవనగర్ సాయిబాబా ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు .. కొండూర్ గ్రామంలో.. కలిగోట్‌లో గ్రామంలో..



డిచ్‌పల్లి ఖిల్లా రామాలయానికి సీతారాముల విగ్రహాలను తీసుకొస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



దుబ్బాక రామాలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు



గుండారం గ్రామంలో దోలారోహణం



నగరంలోని పెద్ద రాంమందిరంలో..

సిరికొండ/ధర్పల్లి/జక్రాన్‌పల్లి/ఇందల్వాయి/నిజామాబాద్ సిటీ/మోపాల్(నిజామాబాద్‌రూరల్)/డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా జిల్లాకేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని రామాలయాల్లో ఆలయ కమిటీలు, వీడీసీల ఆధ్వర్యంలో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి స్వామివారి కల్యాణం నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు సమర్పించారు. అర్చకులు వేద మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలతో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అలాగే ఆలయంలో భక్తులు యజ్ఞం, హోమం ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. పలు ఆలయాల వద్ద ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు ఏర్పాటు చేశారు.

లక్ష్మణుడు లేని సీతారామ ఆలయంగా ప్రసిద్ధిగాంచిన ఇందల్వాయి రామాలయంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ పాల్గొని, స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా రూ.25వేలు అందజేశారు. అలాగే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రూ.50 వేలు అందజేశారు. లొంక రామలింగేశ్వర స్వామి ఆలయంలో, కొండూర్, తాళ్లరామడుగు గ్రామాల్లో రామాలయాల్లో, నగరంలోని ఖిల్లా రామాలయం, సుభాష్‌నగర్ రామాలయం, బడా రాంమందిర్, ఆర్యనగర్ సీతారాముల ఆలయం, న్యాల్‌కల్ రోడ్డు కోదండ రామాలయం, కంఠేశ్వర్ హౌసింగ్‌బోర్డు కాలనీ, మాధవనగర్ రామాలయంతోపాటు పలు హనుమాన్ ఆలయాల్లోనూ రాముల వారి కల్యాణాన్ని నిర్వహించారు. నగరంలోని పాంగ్రా బ్యాంక్‌కాలనీ కమ్యూనిటి హాల్‌లో నిర్వహించిన రామనవమి వేడుకల్లో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ కుటుంబ సభ్యులు, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ దంపతులు కల్యాణ పెద్దలుగా స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి పూజలో కూర్చున్నారు. నేడు(శుక్రవారం) శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయాల కమిటీలు భారీ ఏర్పాట్లు చేశారు. మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల క్షేత్రంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి దంపతులు, దిల్‌రాజు దంపతులు, 'బలగం దర్శకుడు జబర్దస్త్ వేణు, ఛాయాగ్రహకుడు కేవీ గుహన్, జబర్దస్త్ నటులు రాంప్రసాద్ పాల్గొన్నారు.



ఇందూరు తిరుమల ఆలయంలో..



తాళ్లరామడుగు రామాలయంలో..



కల్యాణంలో పాల్గొన్న బాజిరెడ్డి జగన్ దంపతులు



బోర్గాం(పీ) గ్రామంలో..



కాలూర్ గ్రామంలో..



ధర్మారం(బి) గ్రామంలో..






ఇందల్వాయి రామాలయంలో పూజలు చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్.. నగరంలోని ఖిల్లా రామాలయంలో బీజేపీ నాయకుడు ధన్‌పాల్.. కాంగ్రెస్ నాయకుడు ధర్మపురి సంజయ్.. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



రాముడి వేషధారణలో బాలుడు



సుభాష్‌నగర్ రామాలయం వద్ద భక్తుల క్యూ



సారంగపూర్ గ్రామంలో..





ఖిల్లా రామాలయంలో నృత్యాలు చేస్తున్న పురోహితులు.. మాధవనగర్ సాయిబాబా ఆలయంలో అన్నదానం.. ఖిల్లా రామాలయంలో చలివేంద్రం

ఆర్‌యూబీ, ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి ఏర్పాటు చేయించండి



ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఘన్‌పూర్ గ్రామస్తులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, రైల్వేగేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) ఏర్పాటు చేయించాలని ఘన్‌పూర్ ప్రజలు, బీఆర్‌ఎస్‌నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి తమ ఇబ్బందులను తెలియజేశారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ఆర్‌యూబీ ఏర్పాటు చేయించాలని కోరారు. డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌కు ఇవతల ఉన్న ఘన్‌పూర్ గ్రామంలోనే రెవెన్యూ, మండల పరిషత్, ఇతర శాఖల కార్యాలయాలు, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నాయన్నారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు రైల్వేస్టేషన్‌లోని పట్టాలు దాటుతూ ఆయా కార్యాలయాలకు చేరుకుంటున్నారన్నారు. పట్టాలు దాటే సమయంలో పలువురు ప్రమాదాలకు గురయ్యారని, ఈ విషయమై ఎన్నిసార్లు చెప్పినా రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ఆర్‌యూబీ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతశ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రంజిత్ కుమార్, పార్టీ నాయకులు గడ్డం గంగాధర్, యేన్నోళ్ల రాజు, రవి కిరణ్, గంగిసాయిలు, గణేష్ రెడ్డి, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

6నుంచి 'పల్లెపల్లెకు ఓబీసీ-ఇంటింటికీ బీజేపీ'



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 6నుంచి 14వ వరకు 'పల్లెపల్లెకు ఓబీసీ – ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. ఈమేరకు నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం మోదీ ప్రభుత్వం బీసీలకు చేకూర్చిన ప్రయోజనాలు ప్రజలకు తెలిపేందుకు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కేంద్ర మంత్రివర్గంలో 27 మంది ఓబీసీలకు మోదీ స్థానం కల్పించాలని, వీరిలో ఐదుగురు కేబినెట్ ర్యాంక్‌లో ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 33శాతమున్న బీసీ రిజర్వేషన్లను దాదాపు 10శాతం తగ్గించి, 23శాతానికి కుదించారని, రాష్ట్రంలో బీసీలను సర్పంచులు కాకుండా రాజకీయంగా అణచివేసే కుట్ర బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, నాయకులు యామద్రి భాస్కర్, లక్ష్మీనారాయణ, శీల శ్రీనివాస్, నాగరాజు, శ్రీనివాస్‌శర్మ, ఇప్పకాయల కిషోర్, రాజన్న, నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా రామాలయంలో కరెంట్ కోత



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ఖిల్లా రామాలయంలో గురువారం శ్రీరామ నవమి రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. భక్తులు భారీగా రామాలయానికి తరలివచ్చిన సమయంలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం 6.40 నుంచి రాత్రి 8.50గంటల వరకు పలుమార్లు కరెంట్ పోవడం, రావడం జరిగింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలో నిలబడ్డ సమయంలో కరెంట్ పోవడంపై వారు మండిపడుతున్నారు. పలుమార్లు భక్తులు ఫోన్ చేసినా విద్యుత్‌శాఖ అధికారులు ఫోన్‌లు లిఫ్ట్ చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నగరం అంతా కరెంట్ ఉందని, కేవలం ఖిల్లా చౌరస్తా నుంచి ఖిల్లా రామాలయం వరకు, ఆలయంలో విద్యుత్ సరఫరాలో లేదన్నారు. మధ్యాహ్నం సీతారాముల కల్యాణ సమయంలో కూడా కరెంట్ లేదని భక్తులు పేర్కొంటున్నారు. ఆలయంలో విద్యుత్ సరఫరా లేని ఫోటోలు, వీడియోలు సామాజిక మధ్యామాల్లో పెట్టి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై భక్తులు నిలదీస్తున్నారు.

లక్ష్మీనారాయణ ఆలయ వార్షికోత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సిరికొండ: మండల కేంద్రంలోని శేషసాయి లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో 60వ వార్షిక ఉత్సవాలు గురువారం ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో స్వామివారికి అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో శుక్ర, శనివారాల్లో హోమం, పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం అన్నసత్రం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో ఉపసర్పంచ్ బడాల రామకృష్ణ, కమిటీ సభ్యులు డాక్టర్ లింబాద్రి, గంగాధర్, రంజిత్, భూషణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని 16, 17, 37, 38, 39, 40 డివిజన్లకు సంబంధించి బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించనున్నారు. నగరంలోని దుబ్బ మున్నూరుకాపు సంఘంలో నేడు ఉదయం 10.30గంటలకు కార్యక్రమం ప్రారంభంకానున్నట్లు పార్టీ శ్రేణులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా హాజరుకానున్నారన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	59,025	వెండి (కిలో)	71,000
22 క్యారెట్స్	53,413		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	క్యాప్సికం	50	70
బెండకాయ	40	60	గాజరుగడ్డ	15	30
జీరకాయ	50	70	పచ్చిమిర్చి	40	60
దొండకాయ	30	50	దోసకాయ	20	40
బీర్నీసుకాయ	40	60	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	10	20
వంకాయ	25	50	గోబిపువ్వు	20	40
పాలకూర	25	50	బీట్‌రూట్	20	40
మెంతికూర	50	70	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	25	50	చిక్కుడుకాయ	60	80
పుదీనా	30	60			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్–1– జాక్ వైక్ చాప్టర్–4 – 10.15,4.10
బలగం –1.20,7.30 ఆరెంజ్(తెలుగు)–10.20
స్క్రీన్–2– ఆరెంజ్–తెలుగు–10.30,7.30
జాక్ వైక్ చాప్టర్–4 –1.20,10.25
రంగమార్తాండ–4.30
స్క్రీన్–3– దాస్ కా దమ్కీ – 10.30, 1.30, 4.30, 7.30, 10.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– జాన్‌విక్ చాప్టర్–4(తెలుగు), 12.00
జాన్ విక్ చాప్టర్–4(ఇంగ్లీష్), 3.30, 7.00, 10.30
స్క్రీన్–2 – రంగమార్తాండ–12.05
దాస్ కా దమ్కీ–3.20 ,10.00
జాన్ విక్ చాప్టర్–4 (తెలుగు)–6.30
స్క్రీన్–3– కోస్టి –(తెలుగు) –10.20,1.20
గీతసాక్షిగా –(తెలుగు),4.05
రంగమార్తాండ –(తెలుగు)7.00,10.15 స్క్రీన్–4– తు జూతి మే మక్కర్(హిందీ),1.05
బలగం–(తెలుగు),4.35,10.20
షజామ్..ఫ్యూరీ ఆఫ్ ది గాడ్స్,7.25

దేవి	దాస్ కా దమ్కీ
నటరాజ్	కోస్టి (తెలుగు)
లలితామహల్	రంగమార్తాండ
విజయ్	బలగం